పడకపోవడమే మంచిది. అన్నట్లు డాక్టరు వాడి విడుదలకోసం యత్నించాడే! ఇంతవరకు యెందుకు రాలేదు? అదే విచిత్రంగా ఉంది. మరొకసారి వాడి సంగతి కనుక్కోవాలి. ముసలది కూడా వాణ్ణి చూట్టానికి ఆరాట పడుతున్నది.

అయితే ఇప్పటికీ ఒకటి తలచుకొంటే నవ్వు వస్తున్నది. ఒకప్పుడు తాను నిర్దోషి కాడేమో నన్న శంక ఉండేది. ఎంత విచిత్రం! ఇప్పుడు జ్ఞప్తికి వస్తున్నది. హోటలు గదిలో ఉండగా తనకు హామీ ఉండవలసినదని శేషయ్య అడిగాడు. అయితే సంతకాలు హోటల్లో జరిగాయా? అంతకన్నా పిచ్చి అబద్ధం యేమి ఉంటుంది? ముసలిది మొదటినుంచి మొత్తుకుంటూనే ఉన్నది. తనది మెత్తని మనస్సు. అందువల్లనే తాను హామీ ఉన్నానని శేఖరం చెబితే నమ్మాడు. అతడు అంత దుర్మార్గుడని తనకు తెలియలేదు.

ఇన్నాళ్ళకు గ్రామంలో తిరిగి శాంతి నెలకొన్నది. మళ్ళీ కార్మికుల ఎద్దడి ఉండదు. తన మీద బయలుదేరిన అపవాదుల్లో కొన్నైనా ఇరుగుపొరుగులు నమ్ముతుండాలి. నమ్మనీ. తాను ఉన్నాడు, తన పొలం ఉన్నది. ఎవరేమనుకొంటే తనకేమి?

శేఖరం కుటుంబానికి ఇక్కట్లు వచ్చాయి. తీర్పు చెప్పినప్పటినుంచీ భార్య మంచం పట్టిందంటున్నారు. పట్టకేమిచేస్తుంది. భర్త నష్టేటముంచిపోతే? ఎవరి కర్మకు ఎవరు కర్తలు?

పుల్లయ్య ఇంటికి తిరిగివచ్చేటప్పటికి అమ్మాయమ్మగారు హాల్లో కూర్చుని ఉంది. గ్రామం తనకు టీ పార్టీ ఇవ్వటానికి సంకల్పించిందనీ, హరిజనాశ్రమం వార్షికోత్సవ సందర్భంలో మంత్రిగారు తన ఛాయా చిత్రాన్ని ఆవిష్కరించటానికి అంగీకరించారని ఆమె చెప్పింది.

"నాకా, టీపార్టీయా?" పుల్లయ్య నవ్వాడు తన చెవులను తాను నమ్మలేకపోయాడు.

"మీకు ఎప్పుడు వీలు పడుతుంది?" అమ్మాయమ్మ అడిగింది.

అయితే నిజమే నన్నమాట! పుల్లయ్య ఆలోచించాడు.

"దొడ్గో శవం బయటికి వెళ్ళిందో లేదో టీ పార్టీలకు వచ్చేదా?" అతడు అన్నాడు. లక్ష్మమ్మకు ఆశ్చర్యం కలిగింది. కావాలని సన్మానం చేయబోతుంటే యిదేమి టనుకున్నది. అప్పుడు పట్టుబట్టి లాభంలేదని ఆమెకు తెలుసు.

అమ్మాయమ్మగారు వెళ్ళిపోతూ ఆశ్చర్యపడ్డది. ఇంత గౌరవం తలపెడితే కృతజ్ఞతనన్నా సూచించలేదు. ఎంత గర్వమో మనిషికని విస్తుపోయింది.

(ఇంకా వుంది)

కథానిక

# బాహ్యాంతరాలు

అవసరాల రామకృష్ణారావు

ప్రతి మనిషికీ జీవితంలో మారిపోయే ముహూర్తము అంటూ ఒకటి ఉంటుందని శిరీష కుమారి యీనాటికి స్వానుభవ పూర్వకంగా నమ్మింది. లేకపోతే అరగంట క్రిందటి తనకూ, యిప్పటి తనకూ ఇంతమార్పు ఎందుకురావాలి? ఈ నిమిషాలే తనజీవితంలో జ్ఞాపకముంచుకోవలసిన మధుర క్షణాలు. అయితే తను యిలా మారిపోయిందంటే ఏ ప్రగతికోసం? అదితలుచుకొనేసరికి ఆమె మనసు సంతోష సాగరంలో సయ్యాట లాడింది.

తనకోసం ఎందరు పెళ్ళికొడుకులు రాలేదు. ఎందరు నిరాశతో వెళ్ళిపోలేదు? ఎవ్వరైనా యిలా హృదయమంతా ఆక్రమించి, అధిష్ఠించి మరికదలనని కూర్చున్నవారున్నారా? మొగాళ్ల సమక్షంలో కాలేజీలో ప్రతి డ్రామాలోనూ నిర్భయంగా పాల్గొనే తను అతన్ని సరిగ్గా ఎందుకు చూడలేకపోయింది? అతనికి తనకూ ఏది అడ్డొచ్చింది?

తెలిసింది, శిరీషకి తెలిసిపోయింది. తనలోని కృతిమత్వాన్ని అతనిలోని పవిత్రమయిన సహ

జత్వం గెలిచింది. తన్ని గెలిచింది అతని కృత్రిమ సౌందర్యం కాదు, తెచ్చిపెట్టుకున్న అందచందాలు కావు, అతని సింప్లిసిటీ! అతని సహజ సౌందర్యమే తన హృదయాన్ని మెప్పించి, ఒప్పించి స్వాధీన పరచుకుంది!

ప్రతి పెళ్ళి కొడుకూ వచ్చినప్పటిమాదిరి గదంతా సువాసనాపూరితమైపోలేదు, సిగరెట్ పొగలతో నిండిపోలేదు, బూట్ల టకటకలతో శబ్దమయం అయిపోలేదు. ఒక విధమయిన కాంతి నిశ్చలత, గంభీరత అతను కూడా తెచ్చుకున్నాడేమో! తన్ని సినిమా పాటలు పాడమన లేదు, యింగ్లీషు రీడింగు యిమ్మనలేదు. అంతా కళ్ళతోనే అతను కనిపెట్టేసినట్టుంది. ఆ కళ్ళకు ఎంత శక్తి ఉందో!

ఒక్కసారి కన్నెత్తి అతని మొహంలోకి చూడగానే తను పాతాళంలోకి దిగిపోయి నట్లయింది. అందమయిన నొక్కు నొక్కుల జుత్తు, తన వైపు చూస్తున్న చక్కని కళ్ళు... అంతే, ఇంకేమీ చూడకుండానే ఆమె చూపులు వాలిపోయాయి.

శిరీష తన వైపు చూసుకుంది. కాళ్ళకి కాన్వార్ స్లిప్పర్స్, కళ్ళకి కూలింగు గ్లాసెస్, మొహానికి పౌడరు, పెదిమెలకు లిప్‌స్టిక్, గోళ్ళకి నెయిల్ పెయింట్, సూరత్ సిల్కు చీర, సాటిన్ బ్లౌజు, పట్టు సవరం జడ, జడ మధ్య ప్లాస్టిక్ రిబ్బన్... ఒక్కొక్కటి ఒక్కొక్క ముల్లులా ఆమె కంట్లో గుచ్చుకుంది. అతను?

అతనికి రెండు షర్ట్సు, పైన ఫులు సూటు, ఆపైన నెక్ టైతో ఒళ్ళు దాచుకోవలసిన అవసరం లేదు. దీర్ఘమయిన అతని బాహువులకి ఫుల్ హేండ్స్ అవసరం లేదు. సహజమై క్లుప్తమయిన అతని అందచందాలు ఆమెను మెప్పించడమే కాక ఆమెలో మార్పు కూడా తీసుకురావడం ఆమెకు చాలా ఆశ్చర్యం వేసింది.

అంతులేని ఆలోచనలతో శిరీష కుమారి ఆలా ఎంతసేపు గడిపిందో ఆమెకే తెలీదు. సుజాత మాటలతో ఆమె వెనక్కి తిరిగింది.

"ఏమే ఏమంటున్నారు వెంకట సుబ్బయ్యగారు?"

సుజాత వెకిలి నవ్వులు చూస్తే శిరీషకి ఒళ్లు మండింది.

"ఏదో అంటున్నారులే, నీకెందుకూ?"

"అదేమిటేవ్ అలా కసకసుకు వస్తున్నావు అప్పుడే? కొంపతీసి యీతను గాని నీకు నచ్చలేదు కద?... నే అనుకుంటూనే ఉన్నాన్లే యిలాంటి నాసిరకమేదో నువ్వు మెచ్చుకుంటావని! లేకపోతే వచ్చిన వాళ్ళనే పంపించిన నీకు..."

"అబ్బ. నామనసదోలా ఉంది, నన్ను చంపక వెళదూ బాబూ."

"ఉండదూ? ఉంటుంది మరి. ఉండక పోతుందా? ఉండి తీరుతుంది" ఈ మాటలే వెక్కిరిస్తూ అంటూ సుజాత వెళ్ళిపోయింది. సుజాత మీద చెప్పలేని అసహ్యం కల్గింది శిరీషకు. "వీళ్ళకళ్లు సత్యాన్ని పరికించలేవు, నిజాన్ని తెలుసుకోలేవు పై ఆడంబరాలకి దాసులైపోతారు, భేషజాలకి పొంగిపోతారు. ఛీ" అనుకుంది శిరీష. ఇప్పుడు సుజాత కట్టిన పట్టు చీర నూటపాతికకు తక్కువ ఉండదు. ఆ నూటపాతికతో ఒక సామాన్య కుటుంబమంతా బట్టలు కుట్టించుకోవచ్చు. పరిసర పరీక్ష లేని యీ లోకం ఎన్నాళ్ళకి బాగుపడుతుంది?

వాళ్ళూ వీళ్ళూ. యెందుకు? తను ఇన్నాళ్ళూ చేసిందేమిటి? ఊరిలోకి ఏ కొత్తపద్ధతి వస్తే దాన్ని అనుసరించి తీరింది. అనుకరణే జీవితం అనుకుంది. కృత్రిమ పద్ధతుల్తో సౌందర్యం వృద్ధి చేసుకుందామని ఉవ్విళ్లూరింది. ఛీ. యిన్నాళ్ళూ తనకింత భావదాస్యం.

శిరీష కిటికీలోంచి చూసింది. గడ్డివాము ప్రక్కని పనిచేసే లచ్చి తన మామకి గోరింటాకు చేతులు చూపిస్తోంది. "ఎలా ఉన్నాయి మాంవా?" అంటోంది. వాడు దాని చేతుల్ని తన చేతులలోకి తీసుకుని ముద్దెట్టుకున్నాడు. వాడి వంటిని బుష్‌కోట్లూ, ఆఫ్ సూట్లూ లేవు. దాని ఒంటిని గాజు చీరలూ, క్రేప్ బ్లౌజులూ లేవు. వాళ్ళకి బెడ్‌షీట్లు అక్కర్లేదు. మెర్క్యురీ లైటు అక్కర్లేదు. గడ్డివామే, చందమామే, చల్లనిగాలే వారికి ప్రాణం, స్వర్గం. శిరీష వాళ్ళిద్దరికీ లోలోన నమస్కరించింది. వారిదగ్గిర సహజత్వం, సజీవం, సంపూర్ణత ఏవి లేవు?

శిరీష బట్టలు మార్చేసుకుంది. మామూలు చీరా, జాకెట్టూ తొడుక్కుంది. తల పిన్నులు తీసేసింది. కలకత్తా అన్నయ్యదగ్గిరకు వెళ్ళినప్పుడు నొక్కులునొక్కులు చేయించుకున్న ముంగుర్లను బలవంతాన వంచి, మధ్య పాపిడి తీసుకుని జడవేసుకుంది. మరువం పెట్టుకుంది. ఏనాడో విడాకులిచ్చిన కుంకుమను ఆనాడు మనస్సార పెట్టుకుంది. అద్దంలో చూసుకుని మురిసిపోయింది.

వెనకనుంచి లచ్చి రావడం అద్దంలో కనిపించి యిటు తిరిగింది శిరీష. ఆశ్చర్యంతో లచ్చి కళ్లు మిలమిలా మెరిశాయి.

“అదేటమ్మగోరు ఆయేసం?”

“వేషంకాదే వెర్రిమొహమా, ఇన్నాళ్ళనుంచీ వేసిందే వేషం. ఇదే నా నిజమైన రూపం, తెలిసిందా?”

లచ్చికి! ఆ మాటలు సరిగ్గా బోధపడలేదు.

“ఏమే లచ్చీ, ఇప్పుడు నే ఎలాఉన్నానే?”

“నీకేటి తల్లీ, అచ్చు గౌరమ్మలా ఉన్నావు”

శిరీషకి ఒళ్లు పులకరించింది. కాసేపు ఆలోచించి యిలా అడిగింది:

“ఏమే పొద్దుటొచ్చిన బాబెలాఉన్నారే?”

“ఆయనకేం లోటు? సందమామవలాగున్నారు. కాని...”

ఆ కాని ఏమిటో శిరీషకు తెలుసు అందరిలాగా అతను సూటూ బూటూ వేసుకురాలేదు. టిప్‌టాప్‌గా లేడు. దీనికి కూడా అవే కావాలని వచ్చాయా?

“శిరీసమ్మగోరూ, మిమ్మల్ని పెద్దమ్మగారు పిలుస్తున్నారు.” అంది లచ్చి.

మొట్టమొదట లచ్చికి శిరీష అన్న పేరు నోటంట తిరిగేది కాదు. శేషమ్మగారూ అని పిలిచేది. అసలు తన పేరు శేషమ్మే కాని యీమధ్య మార్చుకుంది. ఈ సంగతి జ్ఞాపకం వచ్చేసరికి శిరీషకి తనమీద అసహ్యం వేసింది.

“ఒసే లచ్చీ! ఇవాళనుంచి నన్ను శిరీషమ్మగారూ అని పిలవద్దు. శేషమ్మగారూ అనే పిలు. తెలిసిందా?”

“అదేటమ్మగారూ అలా పిలుస్తే కోప్పడేవారు?

ఆమాటకి జవాబు చెప్పేలోగా శిరీష తల్లి సుబ్బమ్మగారే అక్కడికొచ్చింది. ఆమెలో మార్పు చూసి ఆవిడ అమితంగా ఆశ్చర్యపోయింది.

“అదేమిటే తల్లీ, అలా తయారయ్యావ్?”

“నాకు బుద్ధి వచ్చింది. ఇకముందు యిలాగే ఉంటాను.”

“అదేమిటే? ఎవరయినా ఏమయినా అన్నారా?”

“ఎవరూ ఏమీ అనలేదు. నాకే యిలా తోచింది”

ఏ కారణంచేనయితేనేం శిరీష సీరియస్‌గా ఉండడం ఆవిడ గ్రహించింది. అలాంటప్పుడు ప్రసంగం మార్చడం సుబ్బమ్మకి అలవాటు.

“వాళ్ళు బీదవాళ్ళని మీ నాన్నగారు వద్దన్నా పిల్లాడు చంద్రుడిలా ఉంటాడని నేనే పిలిపించాను తల్లీ.”

“ధనం ఒకటే ముఖ్యం కాదమ్మా.”

“బాగా చెప్పేవు తల్లీ... ఇంతకీ ఎలా ఉన్నాడు అబ్బాయి?”

చూస్తుండగా శిరీష కళ్ళు వాలిపోయాయి. ఆ అరమోడ్పు కన్నులలో అణచుకున్న భావం అనుభవముఱు అయిన ఆ తల్లి యిట్టే గ్రహించేసింది

సుబ్బమ్మగారి మనస్సు ఎంతో తేలిక అయింది. ఈసమాధానం కోసం ఆమె ఎన్నాళ్లనుంచో నిరీక్షిస్తోంది. ఆమెకు పెద్ద భారం తొలగినట్లయింది.

“అమ్మా! అలంకారాలు, అనుకరణలు సౌందర్యం లేనివాళ్లు కప్పుకొనే కవచాలు. పేరు మార్చుకున్నా మనస్సు మారదు. అలంకరించుకున్నా అంతరంగం వేరవదు. ఈనాటికి నేను యివన్నీ అయన్ని చూడగానే నేర్చుకున్నాను.”

శిరీష మాటలు విని సుబ్బమ్మ పొంగిపోయింది. ఆమె నొసటని మెటికలు విరుస్తూ “నా తల్లి, మా అమ్మ... ఈనాటికయినా మనస్సు మార్చుకున్నావు. పార్వతీదేవిలా తయారయ్యావు. ఇలాంటప్పుడు నిన్ను చూస్తే మా అమ్మ ఎంత సంతోషించేదో!” అని కన్నీళ్ళు తుడుచుకుంది.

శిరీష నిశ్చయం విని రామూర్తిగారు చాలా ఆశ్చర్యపోయారు. ఆయన మొదట్నుంచీ పాశ్చాత్య పద్ధతుల్లో పెరిగిన మనిషి. అలాగే కూతుర్ని తయారుచేశాడు. ఇవాళ కూతురు యిలా మారిపోవడంతో ఆయన ఆశ్చర్యానికి అంతంలేకపోయింది. ఈ విషయం గురించి ఇద్దరికీ నాలుగు రోజులు తీవ్ర ఘర్షణలు జరిగేయి. ఎవరూ తమవాదాన్ని వదలిపెట్టలేదు. కుమార్తె స్వాతంత్ర్యానికేనాడు అడ్డురాని రామూర్తి గారు శిరీష వివాహ నిశ్చయానికి కూడా ఏమీ అడ్డుచెప్పలేదు. సమ్మతిని తెలియజేస్తూ ఉత్తరం రాశారు.

నాలుగో రోజు జవాబు వచ్చింది. అది శిరీష పేరున ఉండటం అందరికీ ఆశ్చర్యం కలిగించింది. ఆ నీలం కవరును పట్టుకుని పారిపోయి గది తలుపు గడియవేసుకుని శిరీష ఉత్తరం విప్పింది.

“మై డార్లింగ్!

ముందు నువ్వు నన్ను క్షమించాలి. ఎందుకు క్షమించాలో తరువాత చెబుతాను. ముందు మనస్సులో క్షమించుకుని యీ ఉత్తరం చూడు.

దూరదృష్టిగలదానివీ, పరిస్థితులు అర్థం చేసుకోగలదానివీ గనుక నేనేం చేసినా నగ్నీ చేసుకుంటానన్నావ్. నీకు నా థేంక్స్.

కన్నె చెదిరే వెన్నెల రాసివి. నువ్వు కాలదన్నినవాళ్ళందరూ నన్ను చూసి ఎంత ఏడుస్తున్నారో చెప్తే తరగదు. నా అందమంతా నీ ముందు ఒలకబోసుకోలేక పోయాను. ఈ ఫేషన్ లెస్ బ్రూటును చూసి నువ్వెంత విచారించావో!

“అప్టుడేటు”గా లేని నీకాబోయే భర్తను చూచి నువ్వాట్టే విచారించకుండా జరిగిన సంగతి చెప్తా విను.

నిన్ను వెంటనే చూసి రమ్మని మా ఫాదర్ అప్పటికప్పుడు ప్రెస్ చేశారు. ఆ మరునాడు వద్దామంటే పరీక్షలు. అందుకని అప్పటికప్పుడు బయల్దేరాను. సూట్లూ, బుష్ కోట్లూ అన్నీ చాకలాడిదగ్గర ఉండిపోయాయి. వెధవ కబురంపించినా తేలేదు. వాసన నూనె నేనే తొందర్లో తన్నేశాను. పౌడరంతా మా చెల్లి వాడేసింది. మా నాన్నగారి తొందర హడావిడీ ఒకటి. ఆ గొడవలో బూటు మరిచిపోయాను.

ఎందుకూ? ఇప్పుడు టైలూ, సూట్లూ నన్ను చూసి నవ్వుతున్నాయి. నన్ను చూసి యింత ‘ఓల్డ్ ఫేషన్డ్ ఏనిమల్’ని చూసి నీ ప్లాస్టిక్ రిబ్బన్లూ, నీ కాన్పూర్ షూసూ, ఏమనుకున్నాయో!

అసలు నేను ఎక్కువ ఫేషన్లు కలవాడిని కాను. దానికి తగ్గ డబ్బూ మాకు లేదు. అయినా నీపక్కని నిలబడే అర్హత సంపాదించడానికి ఏమయినా చెయ్యదల్చుకున్నాను. ఇప్పుడు కొత్తరకం పువ్వుల పువ్వుల బుష్ షర్టులు వస్తున్నాయి చూశావూ, ఆ రకం ఓ అరడజనుకి నా తలయినా తాకట్టెట్టి ఆర్డరిస్తాను, సరా?

నా పేరు చూస్తే నవ్వొస్తోందా? కళ్ళతో ఎంత సౌంజ్ఞ చేసినా చూసుకోకుండా మా నాన్న వెంకటసుబ్బయ్య అని యిట్టే చెప్పేశాడు. అవన్నీ మనసులో పెట్టుకుని ఊ బాధపడకు. నీ యిష్టమొచ్చిన పేరెడుదుగాని. సరా?

వస్తాను, డియర్.”

ఆ ఉత్తరం చూసి శేషమ్మ నోట మాట రాలేదు. ఆ తరువాత శేషమ్మ మొహం చూసి రామ్మూర్తి గారికీ నోట మాట రాలేదు.

పిల్లలు గల కుటుంబం. తండ్రి జబ్బుతో ఆస్పత్రిలో వున్నాడు. తల్లి పిల్లలను తీసుకొని తండ్రిదగ్గరికి పోయింది చూచిరావడానికి. ఇంటికి బయలుదేరబోతూ నాలుగేళ్ళ కొడుకు నాన్న దగ్గరగా వెళ్ళి “నేను మంచివాడిని కదూ నాన్నా?” అనడిగాడు.

“తప్పకుండా” అన్నాడు తండ్రి మెల్లగా.

“మరి నాకు పాపాయిని చూపించవూ?”